క్లుప్తంగా

19న విభిన్న ప్రతిభావంతులకు మెడికల్ క్యాంప్

యర్రగొండపాలెం:

విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల ఉపకరణాల కోసం ఈ నెల 19న మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈవో పి.ఆంజనేయులు శనివారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో జరిగే క్యాంప్‌లో 6 నుంచి 17 సంవత్సరాల దివ్యాంగ విద్యార్థులు అర్హులని, వీరిని వైద్య నిపుణులు పరీక్షించి వైకల్యాన్ని బట్టి ఉపకరణాలకు సిఫార్సు చేస్తారని తెలిపారు. వినికిడి యంత్రం, వీల్‌చైర్, సీపీ చైర్ అందజేస్తారని, విద్యార్థులు 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, యూడీఐడీ గుర్తింపు కార్డు తీసుకొని హాజరు కావాలన్నారు. గుర్తించిన విద్యార్థులకు అలింగో ద్వారా త్వరలో ఉపకరణాలు ఇస్తారని, పూర్తి వివరాల కోసం 95734 34486, 95738 13497 నంబర్లను సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు ప్లేట్లు వితరణ


విద్యార్థులకు ప్లేట్లు అందిస్తున్న దాత

కురిచేడు: మండలంలోని అలవలపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎస్సీ) విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానోపాధ్యాయుల అభ్యర్థన మేరకు గూడూరి శైలేష్ ఐదు వేల రూపాయల విలువైన 60 ప్లేట్స్ బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు దస్తగిరి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

తిరుమలనాథ స్వామికి ప్రత్యేక పూజలు


స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథస్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దేవాలయం అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు, ఆభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చనలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

వర్షాలు సకాలంలో పడాలని పొంగళ్లు


స్వామి వారి వద్దకు వస్తున్న భక్తులు

కురిచేడు:

సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ శ్రీ పట్టాభి సీతారాముల వారికి మహిళలు శనివారం పొంగళ్లు పొంగించి నైవేద్యం నివేదన చేశారు. మేళతాళాలతో గ్రామస్తులు స్వామి వారి ఆలయం వద్దకు వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కాటంవారిపల్లెలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత బస్సు..తుస్సు!


బస్సులో సాధారణంగా ఉన్న మహిళా ప్రయాణికులు


మండల కేంద్రాలకు ఏర్పాటు చేసిన బస్సు

- పల్లెలకు సర్వీస్‌లు నిల్
- గ్రామీణ ప్రాంత మహిళలకు ప్రయోజనం శూన్యం

దర్శి: కూటమి నాయకులు ఎన్నికల హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని శుక్రవారం నుంచి అమల్లోకి తీసుకొచ్చింది. ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో అయిన ఐదు రకాల బస్సుల్లో ఉచితంగా మహిళలు ప్రయాణం చేయవచ్చని ప్రభుత్వం నిర్ణయించింది. మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేయాలంటే ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఓటర్ కార్డు ఈ మూడింట్లో ఏదో ఒకటి తప్పనిసరిగా కండక్టర్‌కు చూయించాలి. నాలుగు రోజుల వరకు మహిళలు ఎటువంటి కార్డు చూపించకున్నా ఉచితంగా ప్రయాణించవచ్చని కండక్టర్లు తెలియజేస్తున్నారు. ఇదిలా ఉండగా..సీఎం చంద్రబాబు ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు తుస్సు మనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు సర్వీసులు లేక పోవడంతో పెద్దగా బస్సులు ఎక్కేవారు కనిపించడం లేదు. ప్రధానంగా సూపర్ లగ్జరీలు దూర ప్రాంతాలకు వెళ్తున్నాయి. వాటిలో మాత్రం ఉచితం లేక పోవడంతో మహిళలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దర్శి నియోజకవర్గం ప్రధానంగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. పట్టణ ప్రాంతాల్లో నివసించే వారితో సహా వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనాధారం సాగిస్తున్న వారే ఎక్కువగా ఉన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొలం పనులు జోరందుకున్నాయి. ఈ తరుణంలో ఉచిత బస్సు పెట్టడంతో ప్రయాణాలు చేసే వారు కరువయ్యారు. దీనికి తోడు నియోజకవర్గ కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లే బస్సులే తప్ప నేరుగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే బస్సులు నియోజకవర్గంలో ఒకటీ రెండుకు మించి లేవనేది అందరికీ తెలిసిన విషయమే. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో నుంచి మండల కేంద్రాలకు, నియోజకవర్గ కేంద్రాలకు వచ్చే మహిళలకు ఉచిత బస్సు దూరం అవుతోంది. వారంతా ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. నియోజకవర్గ కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు వెళ్లే బస్సుల్లో మాత్రం సాధారణంగా మహిళలు కనిపిస్తున్నారే తప్ప ప్రస్తుతం పెద్ద హడావుడి మాత్రం లేదు.


కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

కార్యకర్తకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ

పెద్దదోర్నాల: ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఈదర సుధాకర్‌ను యర్రగొండపాలెం శాసన సభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం పరామర్శించారు. మండల పరిధిలోని బొమ్మలాపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సుధాకర్ ఇంటికి చేరుకుని క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చిట్యాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని వనభోజనాలు


మద్దలకట్టలో స్వామిని ఊరేగిస్తున్న భక్తులు


ఊరేగింపుగా బోనాలతో మహిళలు

పెద్దారవీడు: మండలంలోని మద్దలకట్టలో ప్రజలు భక్తిశ్రద్ధలతో సీతారామచంద్రమూర్తికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి పైరుపంటలు బాగా పండి రైతన్నల ఇంట సిరులు కురిపించి సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షతో మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీరామచంద్ర మూర్తి, సీతలకు పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రాహాలతో పల్లకిలో వీధుల్లో ఊరేగింపుగా మేళతాళాలతో, భక్తిపాటలు పాడుకుంటూ గ్రామం చివరన ఉన్న పొలాల వద్దకు చేరుకున్నారు. అక్కడ మహిళలు నైవేద్యం తయారు చేసి కాయకర్పూరం స్వామి వారికి సమర్పించారు. అనంతరం ఒకేచోట భోజనాలు చేశారు.

ఇండ్లచెరువులో వన భోజనాలు

దొనకొండ (కురిచేడు) : మండలంలోని ఇండ్లచెరువులో గ్రామ పెద్దలు ఐక్యతతో కుల మతాలకు అతీతంగా శనివారం వన భోజనాలు చేశారు. రాములవారి పీఠాన్ని ఊరు పుర వీధుల్లో ఊరేగించారు.


రామ పీఠాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పురోహితులు రెంటచింతల వారు రాముల వారికి పూజలు చేశారు. భజంత్రీలు, వాయిద్యాలు, తప్పెట్లతో రాములవారి పీఠాన్ని ఊరి పొలిమేర చుట్టూ ఊరేగించారు. కాయ కర్పూరాలు సమర్పించారు. మహిళలు ఉదయం తలంటి స్నానాలు చేసి గ్రామ శివారులో పొలిమేర వద్ద పొంగళ్లు చేసి రాముల వారికి నైవేద్యం సమర్పించారు. మా ఊరు చల్లగా చూడు రామయ్య, పాడి పంటలు సమృద్ధిగా పండాలంటూ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు


పెద్దదోర్నాల: కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే తాటిపర్తి


త్రిపురాంతకం: శ్రీకృష్ణాలయంలో ప్రత్యేక పూజలు

త్రిపురాంతకం: కృష్ణాష్టమి సందర్భంగా శ్రీరుక్మిణి సమేత వేణుగోపాలస్వామికి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. మండలంలోని సోమేపల్లి శ్రీకృష్ణుని ఆలయంలో రుక్మిణి వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు, కళ్యాణం అర్చకుడు నిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనంతో తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఏటా కృష్ణాష్టమి వేడుకలను గ్రామంలో వైభవంగా నిర్వహిస్తారు.

పెద్దదోర్నాల: శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణ ప్రజలు శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గోమాత పూజతో కార్యక్రమాలు ప్రారంభించి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో జరిగిన కృష్ణాష్టమి వేడుకలు ఆపాల గోపాలన్ని అలరించాయి. ఈ సందర్భంగా యర్రగొండపాలెం నియోజకవర్గ శాసన సభ్యుడు బొమ్మలాపురంలో జరిగిన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు ప్రదర్శించిన పలు సన్నివేశాలు అందరినీ మంత్రముగ్ధులను చేశాయి. ఈ సందర్భంగా గోపికలు, యశోద, శ్రీకృష్ణుడు వేషధారణలతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఇస్కాన్, షిర్డీసాయి ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఉట్టి మహోత్సవం నిర్వహించారు.


దొనకొండ: ఆనందాశ్రమంలో శ్రీకృష్ణ భగవానుడు

దొనకొండ (కురిచేడు): మండలంలోని పలు గ్రామాల్లో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఇండ్లచెరువు గ్రామానికి చెందిన యాదవ సంఘం యాత్ శ్రీకృష్ణునికి పూజలు చేసి భోజనాలు ఏర్పాటు చేశారు. ఆనందాశ్రమంలో వెలసిన శ్రీకృష్ణ భగవానునికి ఉదయం 6 గంటల నుంచి అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి, సహస్ర నామార్చనలు, భగవద్గీత పారాయణం చేశారు. ద్వాపర యుగంలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం ఈ భూమిపై అవతార పురుషుడు శ్రీ భగవానుడు మానవాళికి భగవద్గీతను కానుకగా ఇచ్చారన్నారు. అధర్మం కొన్నాళ్లే ఉంటుందని, ధర్మం నిత్య నూతనంగా ఉంటుందని, సనాతన ధర్మమే సంప్రదాయమవుతందని శ్రీకృష్ణుడే ఈ మానవాళికి సందేశం ఇచ్చారని భైరవానంద స్వామి తెలిపారు. అనంతరం వేడుకలకు విచ్చేసిన భక్తులకు భైరవానంద స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ముటుకులలో కంటి వైద్యశిబిరం

పుల్లలచెరువు:

మండలంలోని ముటుకుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు డాక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు. ముటుకుల పిహెచ్‌సీ పరిధిలో ఇటీవల కాలంలో కంటి సమస్యలతో బాధపడుతున్న 102 మందిని గుర్తించి వారికి శంకర్ వైద్యశాల సహకారంతో కంటి ఆపరేషన్‌లు చేశారని, అందులో భాగంగా కంటి ఆపరేషన్లు చేయించుకున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కంటి పరిశుభ్రత, అద్దాలు వాడే విధానం, చూపు మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేశారు. సిబ్బంది చలపతిరావు, శ్రీనివాసరావు, గురుస్వామి, కంటి వైద్యవిభాగం సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం


ముటుకులలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సచివాలయంలో ఒంగోలు కృష్ణ నేత్రాలయం వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్, కార్యదర్శి తెలిపారు. మండల ప్రజలు కంటి వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని, ఆధార్‌కార్డు తప్పని సరిగా తీసుకు రావాలని వారు కోరారు.

చినుకు పడితే చిత్తడే


బురదమయమైన త్రిపురాంతకం ఆర్టీసీ బస్టాండ్

త్రిపురాంతకం: చినుకు పడితే చిత్తడే. వర్షం పడితే స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు దిగే పరిస్థితి లేదు. ప్రయాణికులు బస్సులు దిగేందుకు అనుకూలంగా కాంక్రీట్ నిర్మాణ పనులు జరగక పోవడంతో అధ్వానంగా మారింది. బస్టాండ్‌లో షాపుల ద్వారా ఆర్టీసీకి లక్షల రూపాయల ఆదాయం సమకూరుతున్నా పట్టించుకునేవారే లేరు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఎక్కువగా ఉంటారు. త్రిపురాంతకం పుణ్యక్షేత్రం, ఇతర ప్రాంతాల నుంచి యాత్రికులు, ఆలయాలకు భక్తులు అధికంగా వస్తుంటారు. అదే విధంగా ఇటు కర్నాటక, తమిళనాడు, రాయలసీమ ప్రాంతాల నుంచి రాజధాని విజయవాడ, విశాఖ వైపు వెళ్లేవారు ఇటే ప్రయాణం చేస్తుంటారు. ఆర్టీసీ బస్టాండ్‌లో దూర ప్రాంతాల బస్సు సర్వీసులు ఆగి వారి కాలకృత్యాలు తీర్చుకోవడం, టిఫిన్, భోజనం వంటివి ఇక్కడ క్యాంటిన్‌లో చేస్తుంటారు. అయినా ప్రభుత్వం కనీసం ప్రయాణికుల అవసరాలు తీర్చలేని స్థితిలో ఉంది. వర్షం వస్తే ఆర్టీసీ ప్రాంగణంలో అడుగు పెట్టే పరిస్థితులు లేవు. బస్సు దిగాలన్నా, బస్సులు ఎక్కాలన్నా ఆర్టీసీ ప్రాంగణంలోకి వెళ్లాల్సిందే. అలాంటిది కనీస అవసరాలు తీర్చడంలో ప్రభుత్వ అధికారులు దృష్టి పెట్టడం లేదు. అధికారులు ప్రయాణికుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రాంగణంలో కనీస అవసరాలకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, యాత్రికులు కోరుతున్నారు.

అధ్వానంగా పారిశుధ్యం


రాచకొండలో రోడ్డు పక్కన చేరిన మురుగు

పుల్లలచెరువు:

మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం లోపం కనిపిస్తోంది. రాచకొండలో ఇళ్ల మధ్యే మురుగు చేరి దోమలకు ఆవాసాలుగా ఏర్పడ్డాయి. పంచాయతీలోని ప్రధాన రహదారి పక్కనే మురుగు చేరడంతో నివాసాల మధ్య నివసించే ప్రజలను దోమలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బ్యాంక్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

పెద్దారవీడు:

వ్యవసాయ రుణాలు తీసుకొని బ్యాంక్ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని పంజాబ్ నేషనల్ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈఓ అశోక్‌చంద్ర అన్నారు. మండలంలోని సానికవరం పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో వ్యవసాయ రుణమేళా శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు, రైతులు తమకు అవసరమైన రుణాలు బ్యాంకు ద్వారా తీసుకొని తిరిగి చెల్లిస్తూ అభివృద్ధికి సహకరించాలని కోరారు. వివిధ ప్రాంతాల్లో 10 వేలకు పైగా పంజాబ్ నేషనల్ బ్యాంక్ బ్రాంచీలు, 13 వేలకు పైగా ఏటీఎం సెంటర్లు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. వివిధ పథకాలకు సంబంధించిన కోటి రుపాయలు మంజూరు చేసిన రుణాల పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. హైదరాబాద్ చీఫ్ జనరల్ మేనేజర్, జోనల్ మేనేజర్ సునీల్‌గుప్త, విజయవాడ సర్కిల్ హెడ్ పంకజ్‌కుమార్, రైతులు, ఖాతాదారులు, స్వయం సహాయక గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.


రుణాల పత్రాలు అందజేస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌చంద్ర

బాబు పాలనంతా మోసాలే


క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పుల్లలచెరువు: అధికారం కోసం నోటికి వచ్చిన హామీలు ఇచ్చి అధికారం చేపట్టాక ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు రివాజుగా మారిందని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం పుల్లలచెరువులోని బీసీ కాలనీలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం మోసాలను, పథకాలను ఎగ్గొడుతున్న తీరును ప్రజలకు వివరించారు. వక్తలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రభుత్వానికి చరమ గీతం తప్పదన్నారు. ప్రజా సంక్షేమ పాలన జగనన్నతోనే సాధ్యమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చెప్పేది ఒకటి.. చేసేది ఒకటని, ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

రాష్ట్ర పంచాయతీవింగ్ సెక్రటరీ బి.సుబ్బారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎల్.రాములు, సర్పంచ్‌లు టి.సత్యనారాయణరెడ్డి, ఆవుల కోటిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు, మైనారిటీ నాయకులు యూసఫ్ ఖాన్, ఖాసింవలి, దినేష్ యాదవ్, బచ్చయ్య యాదవ్, పుల్లయ్య, గొడుగు అంజనేయులు, హరినాయక్, హనుమంతురావు, సుందరరావు, మహిళా నాయకురాలు రమణమ్మ పాల్గొన్నారు.

బస్టాండ్ స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తే సహించం

- ఎమ్మెల్యే తాటిపర్తి

పెద్దదోర్నాల:

ప్రభుత్వ స్థలాలను ఆక్రమించేందుకు కూటమి నాయకులు పన్నుతున్న పన్నాగాలు చెల్లవని యర్రగొండపాలెం శాసన సభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ స్థలానికి తమ ప్రభుత్వం ద్వారా డబ్బులు చెల్లిస్తే ఆ బస్టాండ్‌ను ఆక్రమించుకోవాలని టీడీపీ నాయకులు చూస్తున్నారన్నారు. దాదాపు ఎకరా 40 సెంట్ల స్థలాన్ని కొట్టేసేందుకు పన్నాగం పన్నుతున్నారని ఆరోపించారు. గతంలో రోడ్లు భవనాల శాఖ అధికారులు మండలానికి చెందిన కొందరు గ్రామ పెద్దలపై కేసులు పెట్టారని తెలిపారు. ప్రైవేటు స్థలం అయితే రోడ్లు భవనాల శాఖ అధికారులు ఎందుకు కేసులు పెడతారని ఆయన ప్రశ్నించారు. దాదాపు 10 రాష్ట్రాల నుంచి ఎంతో ప్రాముఖ్యత కలిగిన శ్రీశైల పుణ్య క్షేత్రానికి వెళ్లే పవిత్రమైన ఈ ఆర్టీసీ స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నించే వారి ప్రయత్నాలను సాగనివ్వమని స్పష్టం చేశారు. గతంలో ఇంత రద్దీ ఉన్న ఈ స్థలంలో కూటమి నాయకులు మంత్రులతో సమావేశం నిర్వహించారని, దీని ద్వారా ప్రజలకు ఇది ప్రైవేటు స్థలం అన్న సంకేతాన్ని పంపాలన్న దురుద్దేశం ఉందన్నారు. ఇటువంటి ఆటలు తమ ముందు సాగవని ఆయన హెచ్చరించారు. ఇక మీదట ఇటువంటి ప్రయత్నాలు మానుకోవాలని వారికి ఎమ్మెల్యే తాటిపర్తి హితవు పలికారు.


గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి